క్లుప్తంగా

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

డిండి : కొనుగోలు కేంద్రాల్లో వరిధాన్యం కొనగోళ్లను వేగవంతం చేయాలని డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు అధికారులకు సూచించారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఎస్‌ఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుతం వరకు వచ్చిన ధాన్యం, కొనుగోలు పూర్తయిన ధాన్యం వివరాలను సీఈఓ బాల్‌రెడ్డిని అడిగి ఆయన తెలుసుకున్నారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ధాన్యం అమ్ముకునే విషయంలో కొనుగోలు కేంద్రంలో ఏమైనా ఇబ్బందులు తలెత్తితే తమ దృష్టికి తీసుకరావాలని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట డీటీ సీఎస్‌లు హన్మంతు శ్రీనివాస్‌గౌడ్, ముక్తార్, హబీబ్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని తిమ్మాపురం సబ్‌స్టేషన్ పరిధిలో గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ అబ్దుల్లా హబీబ్ తెలిపారు. ఆ సబ్ స్టేషన్ మెయింటెనెన్స్ పనులు చేస్తున్నందున సబ్ స్టేషన్ పరిధిలోని కల్లేపల్లి, పడమటితండా, తిమ్మాపురం గ్రామాల్లో ఉదయం 6గంటల నుంచి 9గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెద్దవూరలో..

పెద్దవూర : మండలంలోని పొట్టిచెల్మ సబ్ స్టేషన్ పరిధిలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు, పర్వేదుల సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాను బంద్ చేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏఏఈ బి.దాసయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సుంకిశాల ప్రభుత్వ నీటి సరఫరా పంపింగ్ స్టేషన్ 132 కేవీ విద్యుదీకరణ పనులు చేపట్టడానికి నిర్ణయించినట్లు తెలిపారు. దీంతో పర్వేదుల సబ్‌స్టేషన్ పరిధిలోని నంభాపురం, పర్వేదుల, జయరాంతండా, కేకేతండా, బాసోనిబావితండా, ఎర్రకుంటతండా, పోలేపల్లి గ్రామాలకు మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల వరకు, పొట్టిచెల్మ సబ్‌స్టేషన్ పరిధిలో పాల్తీతండా, తంగెళ్లతండా గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు. విద్యుత్ గృహ వినియోగదారులు, వాణిజ్య వినియోగదారులు, రైతులు విద్యుత్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో ఆయిల్, కాపర్‌వైర్ చోరీ



ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తున్న విద్యుత్ ఏఈ

త్రిపురారం : గుర్తుతెలియని దుండగులు ట్రాన్స్‌ఫార్మర్లు పగలగొట్టి అందులోని ఆయిల్, కాపర్ వైర్‌ను దొంగిలించిన సంఘటన మండలంలోని కాపువారి గూడెంలో చోటుచేసుకుంది. బుధవారం త్రిపురారం ఏఈ తెలిపిన వివరాల ప్రకారం.. కాపువారి గూడెంలో రైతుల మూడు చిన్న ట్రాన్స్‌ఫారాల్లో గుర్తు తెలియని దుండగులు రెండు ట్రాన్స్‌ఫారాలను పగలగొట్టి అందులో విలువైన ఆయిల్, కాపర్‌ను దొంగిలించినట్లు తెలిపారు. దొంగతనం జరిగిన ట్రాన్స్‌ఫారం విలువ రూ. 2 లక్షలు ఉంటుందని, రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కేసీఆర్.. 'విడిది'లో కాసేపు సేదదీరి..

మాడుగులపల్లి: మాజీ సీఎం, బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ బుధవారం మిర్యాలగూడ పట్టణంలో నిర్వహించిన రోడ్ షోకు వెళ్తూ మాడుగులపల్లి శివారులోగల విడిది హోటల్‌లో కాసేపు సేదదీరారు. సాయంత్రం 5.05 గంటలకు హోటల్‌కు చేరుకున్నారు. పార్టీ ముఖ్య నేతలతో కలిసి స్నాక్స్, టీ తీసుకున్నారు. ఆ సమయంలో పార్టీ అంతర్గత వ్యవహారాలు, రాష్ట్ర తాజా రాజకీయ పరిస్థితులపై వారితో పిచ్చాపాటీగా మాట్లాడారు. హోటల్ వద్ద అరగంటకు పైగా గడిపారు. హోటల్ వద్ద కేసీఆర్ ఆగాడని తెలుసుకున్న కార్యకర్తలు, అభిమానులు అక్కడికి భారీగా చేరుకున్నారు. ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు దిగేందుకు ప్రయత్నించారు. వారిని అదుపు చేయడానికి పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. 5. 40 గంటలకు అక్కడి నుంచి మిర్యాలగూడ బయల్దేరారు. మార్గమధ్యలో కుక్కడం. వేములపల్లిలో బస్సు నుంచే కార్యకర్తలకు అభివాదం చేశారు. కేసీఆర్ వెంట మాజీ ఎంపీ సంతోష్ కుమార్, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రవీంద్రకుమార్, నల్లగొండ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, తిప్పర్తి జెడ్పీటీసీ మాజీ సభ్యుడు సైదులుగౌడ్ ఉన్నారు.

వ్యాయామం చేసేదెలా ?

- విరిగిన ఓపెన్ జిమ్ పరికరాలు
- మరమ్మతులకు నోచుకోని దుస్థితి
- మున్సిపల్ అధికారుల తీరుపై అసహనం



ఎన్‌ఎస్‌పీ క్యాంపు గ్రౌండ్‌లో విరిగిపోయిన పరికరాలతోనే వ్యాయామం చేస్తున్న వ్యక్తి



సుందరయ్యపార్కులోని ఓపెన్ జిమ్‌లో విరిగిన వ్యాయామ పరికరాలు

మిర్యాలగూడ అర్బన్ : పట్టణ ప్రజలు వ్యాయామం చేసేందుకు వీలుగా పట్టణంలో పలు చోట్ల ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేశారు. కాని వాటి ఆలనా పాలన చూసేవారు లేక నిరుపయోగంగా మారాయి. ఓపెన్ జిమ్ ఫ్లోర్‌పై ఏర్పాటు చేసిన రబ్బర్ పలకల వంటి బండలు ఊడిపోయి, అందులోని పరికరాలు అన్ని విరిగిపోయాయి. దీంతో ఓపెన్ జిమ్‌లు నిరుపయోగంగా మారాయి.

ప్రతి నిత్యం వందల మంది వ్యాయామం

కాగా పట్టణంలోని ఎన్‌ఎస్పీ క్యాంపు గ్రౌండ్, ప్రభుత్వం జూనియర్ కళాశాల, బోటిక్ పార్క్, సుందరయ్యపార్క్ ప్రాంతాల్లో పట్టణ ప్రజలు ఉదయం వేళల్లో వాకింగ్ చేసేందుకు వందలాది మంది ఆయా ప్రాంతాలకు వస్తుంటారు. సుమారు గంటకు పైగా వాకింగ్ చేసిన అనంతరం ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ లలో వ్యాయామం చేసేందుకు ఎక్కువగా ఆసక్తి చూపుతారు. కాని ఓపెన్ జిమ్ లోకి ఎంటర్ కాగానే వారికి విరిగిన వ్యాయామ వస్తువులు, నట్లు ఊడిన పరికరాలు దర్శనమిస్తున్నాయి. దీంతో చాలా మంది వ్యాయామం చేయకుండానే వెనుదిరుగుతున్నారు. మరికొంత మంది ఉన్న కొన్ని వ్యాయామ పరికాలతో వ్యాయామం చేసి తమలో తాము సర్దిచెప్పుకుంటున్నారు. దీనికి తోడు ఓపెన్ జిమ్ ఫ్లోర్‌పై ఏర్పాటు చేసిన రబ్బర్ పలకల వంటి బండలు చాలా వరకు ఊడిపోయి ఉండటంతో వ్యాయామం చేసే వారి కళ్లకు తగులుతున్నాయని, దీంతో కాళ్లకు గాయాలు అవుతున్నాయని పలవురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాయామ పరికాలు పనిచేయకుండా ఏళ్లు గడుస్తున్నా.. వాటిని బాగుచేయడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓపెన్ జిమ్‌లలో విరిగిన, నట్లు ఊడిన వ్యాయామ పరికరాలను బాగు చేసి వాటిని వాడుకలోకి తేవాలని, వ్యాయామం చేసే వారికి ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వినియోగంలోకి తేవాలి



ఓపెన్ జిమ్‌లలో వ్యాయామ పరికరాలు పూర్తిగా విరిగిపోయాయి. వాటిని పట్టించుకునే వారే లేకుండా పోయారు. ఓపెన్ జిమ్ పరికరాలు పని చేయడంలేదని అధికారుల దృష్టిలో కూడా వుంది. అయినా వాటిని బాగు చేసి పునరుద్ధరించడంలో పట్టింపు లేకుండా ఉంటున్నారు. ఇప్పటికైనా పట్టణంలో ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్లో పనిచేయని పరికరాలుగుర్తించి వెంటనే బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలి.

– సుంకు శ్రీనివాస్, మిర్యాలగూడ

13మంది బాలకార్మికులకు విముక్తి



ఎస్సీ హాస్టల్‌లో బాలకార్మికులతో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

మిర్యాలగూడ టౌన్ : ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న 13మంది బాల కార్మికులకు అధికారులు మంగళవారం రాత్రి విముక్తి కల్పించారు. మిర్యాలగూడ మండలం గూడూరు సమీపంలోని ఇటుక బట్టీల్లో ఒడిషాకు చెందిన బాలక కార్మికులు పనిచేస్తున్నారనే సమాచారంతో ఆర్డీఓ శ్రీనివాస్‌రావు, తహసీల్దార్ హరిబాబు, సీడీపీఓ మమత, రూరల్ ఎస్‌ఐ నరేశ్, లేబర్ ఆఫీసర్ మంజులలు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో 13మంది బాలకార్మికులను గుర్తించి వారిని పట్టణంలోని ఎస్సీ హాస్టల్‌లో ఉంచారు. దీంతో బుధవారం హాస్టల్‌లో ఉన్న బాల కార్మికులు, వారి తల్లిదండ్రులను జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ(సీడబ్ల్యూసీ) చైర్మన్ చింతా కృష్ణా ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. అనంతరం పిల్లల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ చైర్మన్ చింతా కృష్ణ మాట్లాడుతూ బాల కార్మికుల వివరాలను పూర్తిస్థాయిలో తెలుసుకుని విచారణ చేపట్టి ఆ పిల్లలను ఒడిషా రాష్ట్రంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించనున్నట్లు తెలిపారు. బాల కార్మికులతో వెట్టి చాకిరి చేయిస్తున్న కిరణ్, అశోక్‌లపై జువెనైల్ జస్టిస్ యాక్ట్ (పిల్లల సంరక్షణ, రక్షణ) కింద కేసు నమోదు చేయడంతో పాటు వారికి జరిమానా కూడా విధించనున్నట్లు తెలిపారు. ఆర్డీఓ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ ఇటుక బట్టీల్లో పని చేస్తున్న బాల కార్మికులకు గుర్తించేందుకు ఎప్పటికప్పుడు దాడులను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ విచారణలో మండల సీడబ్ల్యూసీ కమిటీ సభ్యులు కొండ వెంకట్, కిరణ్, వెంకట రమణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి, రాధిక, హాస్టల్ వార్డెన్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో గురుకుల విద్యార్థుల ప్రతిభ



బి.హేమలత 465, ఎంపీసీ | ఎ. శైలజ 433, బైపీసీ | జి జ్యోష్న 483, సీఈసీ | ఈ. సరిత 976, ఎంపీసీ | ఎల్. షైని 966, బైపీసీ



అక్షర 461, ఎంపీసీ | ఫరీహానిదా, 422, బైపీసీ

కొండమల్లేపల్లి : ఇంటర్మీడియట్ ఫలితాల్లో కొండమల్లేపల్లి గురుకుల కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చారు. ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎస్సీ గురుకుల కళాశాలకు చెందిన ఈ.సరిత ఎంపీసీలో 976, ఎల్.షైని బైపీసీలో 966, ఎస్టీ గురుకు కళాశాలలో ఎంపీసీలో ఆర్.మైత్రి 901, బైపీసీలో ఆర్ దివ్య 903 మార్కులు సాధించారు. అలాగే బీసీ గురుకుల కళాశాలకు చెందిన ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో బి.హేమలత 465, బైపీసీలో పి.శైలజ 433, సీఈసీలో జి.జ్యోస్నా 438, ఎస్సీ గురుకుల కళాశాలకు సంబంధించి ప్రథమ సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ విభాగలో ఆర్.ప్రవలిక 453, పి.అనిత 453, బైపీసీ విభాగంలో డి.ఇందు 433 సాధించారు. ఎస్టీ గురుకుల కళాశాలలో ఎంపీసీలో బి.నవ్య 405 మార్కులు సాధించారు. ఎస్సీ గురుకులలో ద్వితీయ సంవత్సరానికి 90 శాతం, ప్రథమ సంవత్సరానికి 92 శాతం, ఎస్టీ గురుకుల కళాశాలలో ద్వితీయ 83.8శాతం, ప్రథమ సంవత్సరానికి గాను 60.71శాతం, బీసీ గురుకుల కళాశాలలో ప్రథమ సం72.85శాతం ఉత్తీర్ణ సాధించినట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్‌లు తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు అభినందించారు.

దేవరకొండ ప్రభుత్వ కళాశాల విద్యార్థులు..

దేవరకొండ : ఇంటర్మీడియట్ ఫలితాల్లో దేవరకొండ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు చెందిన అక్షర ఎంపీసీలో 461, బైపీసీలో ఫరీహా నిదా 422 మార్కులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ తెలిపారు. మేఘన 944, బైపీసీలో తబుస్సుం 891మార్కులు సాధించారు. మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల కళాశాలకు చెందిన బండారు సంజయ్‌కుమార్ ఇంటర్మీడియట్ ద్వితీయలో 987 మార్కులు సాధించారు.

వైభవంగా సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠాపన



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న బుసిరెడ్డి పాండురంగారెడ్డి

త్రిపురారం : మండలంలోని కొణతాలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో బుధవారం సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఆలయంలో గ్రామ పురోహితులు దుగ్గి వెంకటేశ్వర శర్మ పర్యవేక్షణలో కొండగడప హరి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీ సీతారామచంద్రస్వామి పరివార దేవతల సీతారామ, లక్ష్మణ ఆంజనేయ, గణపతి, ద్వారా పాలకుల ధ్వజ ప్రతిష్ఠామహోత్సవము ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విగ్రహ , ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన వేడుకల్లో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ పాండురంగారెడ్డి, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మర్ల చంద్రా రెడ్డి, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యాక్షుడు మైలారుశెట్టి సైదయ్యలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మాజీ సర్పంచ్ జోన్నలగడ్డ వెంకట్ రెడ్డి అతిధులను శాలువాలు కప్పి సన్మానించారు. పలు గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుమారు 2000 మందికి అన్నధాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొణతాలపల్లి గ్రామ ప్రజలు, ఉత్సవ కవిటీ సభ్యులు తధితరులు పాల్గొన్నారు.

మాడుగులపల్లి కేజీబీవీ విద్యార్థినుల ప్రతిభ



బి.జ్యోత్స్న 974, ఎంపీసీ

మాడుగులపల్లి : ఇంటర్మీడియట్ ఫలితాల్లో మాడుగులపల్లి కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ చాటారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ భాగంలో బి. జ్యోత్స్న 974 మార్కులు, ఆర్ పూజిత 955, తులసి 922 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో బి.అంజలి 932, మేఘన 911, గౌతమి 845 మార్కులు సాధించారు. ప్రథమ సంవత్సరం ఎంపీసీ విద్యార్థిని ఆర్.ధనలక్ష్మి 409 మార్కులు సాధించింది. అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థినులను బుధవారం కేజీబీవీ ప్రత్యేకాధికారి సునీత, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డి పూజలు



రఘువీర్‌రెడ్డికి తిలకం దిద్దుతున్న పూజారి



రఘువీర్‌రెడ్డికి హారతి ఇస్తున్న తల్లి

నాగార్జునసాగర్ : నల్లగొండ పార్లమెంట్ అభ్యర్థి కుందూరు జయవీర్‌రెడ్డి నందికొండ మున్సిపాలిటీ హిల్‌కాలనీలో శ్రీరమాసహిత సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు చేసి పూజారుల ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకు ముందే ఇంట్లో తల్లిదండ్రులు కుటుంబ సభ్యుల ఆశీర్వాదం తీసుకోని నామినేషన్ వేసేందుకు నల్లగొండకు బయలుదేరారు. ఆనవాయితీగా ప్రతి ఎలక్షన్‌కు జానారెడ్డి ఈ ఆలయంలో పూజల అనంతరమే నామినేషన్ వేస్తారు. అలాగే జైవీర్‌రెడ్డి కూడా పూజలు చేశారు. ప్రస్తుతం రఘువీర్‌రెడ్డి కూడా పూజలు చేసిన నామినేషన్‌కు బయలుదేరారు. ఆయన వెంట మాజీమంత్రి కుందూరు జానారెడ్డి, సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి, తిరుమలగిరి సాగర్ ఎంపీపీ భగవాన్‌నాయక్, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి ఉన్నారు.

సత్తా చాటిన డిండి గురుకుల విద్యార్థులు



బి.మానస | శృతి | భార్గవి | వి.మాధవి | సాంబశివ

డిండి : మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు) విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటారు. ప్రథమ సంవత్సరంలో 78శాతం, ద్వితీయ సంవత్సరంలో 96 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మ తెలిపారు. ఎంపీసీలో బి.మానస 463, బైపీసీలో బి.శృతి 436, ఎం.మనీషా 436, ద్వితీయలో ఎంపీసీలో కె.గీతాశ్రీ 958,ఎం.భార్గవి 956 మార్కులు సాధించారు. అదే విధంగా ఆదర్శ పాఠశాల,కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 22 శాతం, ద్వితీయ సంవత్సరంలో 78 శాతం ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో వి.మాధవి 923,ఎం.అశ్విని 911,బైపీసీలో ఎం.గీతా 935,ఎస్.సునితా 922, సీఈసీలో సాంబశివ 886, కె.రాజేష్858 మార్కులు సాధించారు. స్థానిక దొంతినేని నరసింహరావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రథమ సంవత్సరంలో 26.66 శాతం, ద్వితీయ సంవత్సరంలో 69.73 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

సాగర్ బీసీ గురుకులంలో తగ్గిన ఉత్తీర్ణత

నాగార్జునసాగర్ : ఇంటర్మిడియట్ ఫలితాల్లో మహాత్మాజ్యోతిరావు పూలే తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల గురుకులంలో ఉత్తీర్ణత శాతం తగ్గింది. ఒకప్పుడు 100శాతం ఉత్తీర్ణతో పాటు రాష్ట్ర స్థాయిలో ర్యాంకుల సాధించిన గురుకులం ఈ ఏడాది వెనుకబడింది. ద్వితీయ సంవత్సరం 93శాతం ఫలితాలు రాగా మొదటి సంవత్సరం ఫలితాలు 75శాతం వచ్చాయి. ఎంపీసీలో రేవంత్‌కు 979, బైపీసీలో భానుప్రకాశ్‌కు 970, ఎంఈసీలో నవీన్‌గౌడ్‌కు 917, సీఈసీలో అన్వేష్‌కు918 మార్కులు వచ్చాయి. అలాగే ఎంపీసీలో నితీష్‌కు 451, బైపీసీలో జశ్వంత్‌కు 404, ఎంఈసీలో చరణ్‌తేజ్‌కు 398, సీఈసీలో వెంకటేశానికి 459మార్కులు వచ్చినట్లుగా ప్రిన్సిపాల్ తెలిపారు. ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

రెండు రోజుల్లో రాజకీయ భవిష్యత్‌ను ప్రకటిస్తా



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ భార్గవ్

మిర్యాలగూడ : రెండు రోజుల్లో తన రాజకీయ భవిష్యత్‌ను ప్రకటిస్తానని మిర్యాలగూడ మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ తెలిపారు. బుధవారం సాయంత్రం స్థానికంగా విలేకరుల సమావేశంలో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ మిర్యాలగూడలో రోడ్‌షో విషయంపై తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. బీఆర్‌ఎస్ అగ్రనేతలు తమకు సమాచారం ఇవ్వకపోవడంతోనే రోడ్ షోకు దూరంగా ఉన్నామన్నారు. తన అనుచరులతో కలిసి త్వరలోనే రాజకీయ భవిష్యత్‌ను వెల్లడిస్తానని చెప్పారు. తన కుటుంబానికి 50ఏళ్ల పాటు కాంగ్రెస్ పార్టీతో అనుబంధం ఉందన్నారు. కొన్ని కారణాల వల్ల గతంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరానని, ప్రస్తుతం తన అనుచరులతో కలిసి చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరే విషయంపై అసత్య ప్రచారం జరుగుతోందని, తనకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రోశయ్య, కౌన్సిలర్లు ఉదయ్‌భాస్కర్, రమేష్, రమేష్ ఉన్నారు.

రాంరెడ్డి ఆశయాలను సాధించాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రంగారెడ్డి

మిర్యాలగూడ అర్బన్ : మాజీ కౌన్సిలర్ సీపీఎం పట్టణ నాయకులు వేముల రాంరెడ్డి ఆశయాలను సాధించాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన వేముల రాంరెడ్డి వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థి, యువజన నాయకుడిగా అనేక పోరాటాలు చేశారని పేద ప్రజల సంక్షేమం కోసం ఉద్యమాలు నిర్వహించారని కొనియాడారు. హౌసింగ్‌బోర్డు కౌన్సిలర్‌గా సేవలందించారని ఆయన లేని లోటు పార్టీకి తీరనిది అన్నారు. అంతకు ముందు రాంరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మల్లు గౌతంరెడ్డి, నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముడావత్ రవినాయక్, పాండు, మంగారెడ్డి, వరలక్ష్మి, పరశురాములు, రామ్మూర్తి, వినోద్‌నాయక్, పద్మ, శ్రీనివాస్, గోవర్ధన, పా పా నాయక్, రామారావు, రామచంద్రు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'ఆదర్శ' విద్యార్థుల ప్రతిభ



బొమ్ము శ్రావ్య 459, ఎంపీసీ | షేక్ కరీం 866, ఎంఈసీ | పాశం ఝాన్సీ 955, ఎంపీసీ | శ్రావణి 927, ఎంపీసీ

గుర్రంపోడు : మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్, మైనార్టీ గురుకుల కళాశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. మోడల్ స్కూల్‌లో మొదటి సంవత్సరం విద్యార్థులు 123 మందికిగాను 98 మంది ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 123 మందికి గాను 100 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ అపర్ణ తెలిపారు. పిట్టలగూడెం గ్రామంలోని మైనార్టీ గురుకుల కళాశాలలో ప్రథమ సంవత్సరం 35 మందికిగాను 32 మంది, రెండో సంవత్సరం 27 మందికిగాను 26 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మహ్మద్ ఫారూఖ్ తెలిపారు. మోడల్ స్కూల్‌లో ప్రథమ సంవత్సర ఫలితాల్లో ఎంపీసీలో టాపర్‌గా బొమ్ము శ్రావ్య 459 మార్కులు సాధించగా ద్వితీయ సంవత్సర ఫలితాల్లో జి. వైష్ణవి బైపీసీలో 943 మార్కులతో టాపర్‌గా నిలిచింది.మైనార్టీ కళాశాలలో ద్వితీయ సంవత్సర ఫలితాల్లో దూదిగాని శివ సీఈసీ విభాగంలో 856 మార్కులు సాధించగా ఎంఈసీ విభాగంలో షేక్ కరీం 866 మార్కులు సాధించాడు.

నిడమనూరు ఆదర్శ పాఠశాలలో..

నిడమనూరు : నిడమనూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో సత్తా చాటారు. ఆదర్శ పాఠశాలకు చెందిన జిల్లేపల్లి ప్రమోద్ ఎంపీసీలో 465, కొక్కు యగ్నేష్459 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో గణపురం నందిని 393, ఎంఈసీలో కొమ్మగోని రేణుక 393 సాధించారు. ఇంటర్ ద్వితీయలో ఎంపీసీలో పాశం ఝాన్సీ 955, బండారు ప్రఝూవణి 927, బైపీసీ చుక్క అంజలి 886, సీఈసీలో షేక్ ఫయాజ్ 674లు సాధించారని ప్రిన్సిపాల్ రంజిత తెలిపారు.

నిజాయితీ చాటుకున్న ఆర్టీసీ కండక్టర్



మహిళకు మంగళసూత్రాన్ని తిరిగి అప్పగిస్తున్న కండక్టర్

దేవరకొండ : విధి నిర్వహణలో ఉన్న ఓ ఆర్టీసీ కండక్టర్ తన నిజాయితీని చాటుకున్నాడు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసిన ఓ మహిళ తన మంగళసూత్రాన్ని బస్సులో పోగొట్టుకోవడంతో డ్యూటీలో ఉన్న కండక్టర్ మంగళసూత్రాన్ని మహిళకు అందజేశాడు. వివరాల ప్రకారం.. శారద అనే మహిళ హైదరాబాద్ నుంచి మాల్‌కు ఆర్టీసీ బస్సులో బయల్దేరింది. బస్సు దిగిన తర్వాత రూ.40వేల విలువ చేసే మంగళసూత్రం పోగొట్టుకున్న విషయాన్ని గుర్తించింది. మాల్ బస్‌స్టేషన్ కంట్రోలర్ ద్వారా దేవరకొండ బస్‌స్టేషన్‌కు సిబ్బంది సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న బస్‌కండక్టర్ యాదగిరి బస్సులో పోగొట్టుకున్న మంగళసూత్రాలను తిరిగి బాధిత మహిళకు అందజేసినట్లు దేవరకొండ డిపో మేనేజర్ రాజీవ్ ప్రేమ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆర్టీసీ అధికారులు కండక్టర్ యాదగిరిని అభినందించారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి

దేవరకొండ : విద్యార్థులు తాము ఎంచుకున్న లక్ష్య సాధనకు కృషిచేయాలని దేవరకొండ ఎంకేఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమావత్ రవి అన్నారు. బుధవారం కళాశాలలో నిర్వహించిన విదేశీ విద్య ఉన్నత అవకాశాలు అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కళాశాలకు చెందిన పూర్వ విద్యార్థి అభియన 2023లో డిగ్రీ పూర్తి చేసిన వెంటనే లండన్‌లోని గ్రీన్ విచ్ యూనివర్సిటీలో సీటు సాధించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్.రామరాజు, డాక్టర్ కృతు, శివకృష్ణ, లింగమయ్య, బాల, మకట్‌లాలు పాల్గొన్నారు.

మహిళ అస్థిపంజరం లభ్యం



మహిళ ఎముకలు సేకరిస్తున్న క్లూస్‌టీం

గుర్రంపోడు : కుటుంబ కలహాలతో ఇంటి నుంచి వెళ్లిపోయి అదృశ్యమైన మహిళ గుర్రంపోడు గ్రామ శివారులో ఎముకలను బుధవారం గుర్తించినట్లు ఎస్‌ఐ శివప్రసాద్ తెలిపారు. తేనపల్లి గ్రామానికి చెందిన బొడ్డు సుభద్ర(32) తన భర్త కిరణ్‌తో గొడవపడి ఫిబ్రవరి 22న ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఈ మేరకు అప్పట్లో పోలీసుస్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. గుర్రంపోడు గ్రామ శివారులో చెట్ల పొదల ప్రక్కన బీడు భూమిలో అస్థిపంజరం ఉన్నట్లు ఉడుతలను పట్టే వ్యక్తి గుర్తించి పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటనా స్థలంలో మహిళ చీరను బట్టి సుభద్రగా కుటుంభ సభ్యులు గుర్తించారు. నల్లగొండ నుంచి క్లూస్‌టీ ంను రప్పించి ఎముకలను సేకరించారు. ఇంటి నుంచి వెళ్లిపోయి చెట్ల మధ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. రెండు నెలలు కావడంతో మహిళ అస్థిపంజరం మాత్రమే మిగిలింది. ఎముకలను ల్యాబ్‌కు పంపించి పరీక్షలు జరిపిస్తామని ఎస్‌ఐ బి. శివప్రసాద్ తెలిపారు.

అతివేగంతో కారు బోల్తా.. ఇద్దరు మృతి

పెద్దఅడిశర్లపల్లి: అతివేగంతో కారు పల్టీకొట్టి మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎయిర్‌వాల్వ్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. ఈ సంఘటన పెద్దఅడిశర్లపల్లి మండలంలోని ఘనపురం స్టేజీ సమీపంలోని హైదరాబాద్-నాగార్జునసాగర్ జాతీ య రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. హైదరాబాద్‌లోని యాకత్‌పురకు చెందిన మహమ్మద్ అజహార్ (32), అతని స్నేహితురాళ్లు సమ్రీన్‌బేగం(19), మదియాతో పాటు తన షాపులో పనిచేస్తున్న మహమ్మద్ జహీర్‌లు నలుగురు కలిసి హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్‌కు విహారయాత్ర నిమిత్తం కారులో బుధవారం ఉదయం బయలుదేరారు. పెద్దఅడిశర్లపల్లి మండలంలోని ఘనపురం స్టేజీ సమీపంలోని హైదరాబాద్- నాగార్జునసాగర్ జాతీయ రహదారిపై గల ఏఏమ్మార్పీ ప్రధాన కాలువ సమీపంలోకి రాగానే కారు అదుపు తప్పి పల్టీ కొట్టుకుంటూ వెళ్లి రోడ్డు పక్కనే గల మిషన్ భగీరథ పైప్‌లైన్ ఎయిర్‌వాల్వ్ దిమ్మను ఢీకొట్టింది. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ నర్సింహులు సంఘటనా స్థలానికి చేరుకొని కారులో ఇరుక్కున్న వారిని స్థానికుల సహాయంతో బయటకు తీయగా కారు డ్రైవింగ్ చేస్తున్న అజహార్, పక్కనే ఉన్న సమ్రీన్‌బేగం అక్కడికక్కడే మృతిచెందారు. మిగిలిన జహీర్, మదియాలకు తీవ్ర గాయాలు కాగా వారిని దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆ తర్వాత హైదరాబాద్‌కు తరలించారు. జహీర్ సోదరుడు ఫరీద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మండల అధ్యక్షుడిగా నజీర్ ఖాస్మి



కొండమల్లేపల్లి : జమియత్ ఉలేమా ఏ హింద్ కొండమల్లేపల్లి మండల అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మౌలానా నజీర్ ఖాస్మి ఐదోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల అధ్యక్షుడిగా ఎన్నిక చేయడంపై రాష్ట్ర, జిల్లా అధ్యక్షులకు కృతజ్ఞతలు తెలిపారు. ముస్లిం సమాజం విద్య, వైద్య, ఆర్థిక, సామాజిక రంగాల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు సంస్థ తరపున కృషి చేయనున్నట్లు తెలిపారు.